# 20. విషాదం మాటున వినోదం

మొన్న శనివారం ఆఫీస్‌నుంచి ఇంటికి రాగానే మా ఆవిడ కాఫీ ఇస్తూ "పరమేశ్వర్రావు గారొస్తున్నారట" అని ఓ పోస్టు కార్డు నా రెండో చేతికి అందించింది.

పరమేశ్వర్రావు మా పక్కవాటాలో ఉండేవారు. మిలిటరీ ఇంజనీరింగ్ సర్వీసెస్‌లో పని. రెండేళ్ల కిందట హైద్రాబాద్ ట్రాన్స్ఫరై వెళ్లిపోయారు. వెళ్తూ వెళ్తూ వాళ్లు "బరువు చేటు" అని ఇక్కడ వొదిలేసిన సామాన్లు - ఫ్రిజ్జు, సోఫా-కం-బెడ్డు, గీజరు, వాషింగు మెషిను, టి.వి.ల్లో టి.వి మాత్రం మాకు, తను 'నేవీ కాంటీన్' లో కొన్న ధరకి కొద్దిగా తక్కువ చేసి అమ్మేశాడు.

ఆ బాపతు ఇంకో రెండు వేలు నేనింకా అతనికి బాకీ ఉన్నాను కూడాను.

అతను ఈ రెండేళ్లలో ఈ వూరికి రకరకాల పనులమీద ఏడెనిమిదిసార్లు వొచ్చాడు. వొచ్చినప్పుడల్లా మా ఇంట్లోనే దిగడం ఆనవాయితీ. అతనికి మేం రెండు వేల రూపాయలు బాకీ ఉండడంవల్ల మా ఇంట్లో మకామూ, భోజనమూ చేసి ఆ బాకీ తాలూకు వడ్డీ కట్టించుకుంటున్నాడేమో అన్న అనుమానం మాకు లేదు. అతను గాని మేంగాని అలా ఆలోచించేటంత నీచులం కాదు.

పైగా, పరమేశ్వర్రావు ఎంత సందడైన మనిషంటేను, మా అబ్బాయిలు గాని, అమ్మాయిగాని, మా ఆవిడగాని, నేనుగాని, అతనితో ఎవరు కూచున్నాసరే, ఎవరికి నచ్చే సబ్జక్టు వారితో మాట్లాడి సరదా చేస్తాడు.

"ఆ, ఇంకా ఏంటి విశేషాలు? మన టి.వి. బాగా పనిచేస్తోందా?" అన్నాడు పరమేశ్వర్రావు, వచ్చి కొంతసేపు కుశల ప్రశ్నల్లోగడిపి.

(ఇదికూడా కుశల ప్రశ్నే. కాని మనుషుల ఆరోగ్యం గురించి అడిగినవే కుశల ప్రశ్న లంటారని మా తెలుగు మాష్టారు అంటూ వుండేవారు.)

"చూసేరా, - "**మన టి.వి.**" - అంటూ అడుగుతున్నారాయన. ఆ బాకీ రెండువేలూ తీర్చెయ్యండీ అంటే మీకు అశ్రద్ధ" అంది మా ఆవిడ నాచెవిలో.

"ఏంటో, నాకు వినపడకుండా మాట్లాడుతున్నారు, అక్కగారు. కొంచెంసేపు నేనలా బైటికి వెళ్ళి రానా?" అని లేచినట్టు నటించేడు పరమేశ్వర్రావు.

"అబ్బే, మీరు - మన టీ.వి. - అంటేను, ఢిల్లీ టీవీ కాదు, హైద్రాబాద్ టీవీ అని అంటోందంతే" అని ఠకీమని అబద్ధం ఆడేశాను.

"ఆ మాట రైటే. కాని మన టీవీ అంటే నా ఉద్దేశం రెండిట్నీ కలిపే అనుకోవాలి. నేనడిగింది మాత్రం, ఈ టీవీ సెట్టు, అనగా, ఈ యంత్రం సమంగా పనిచేస్తోందా అనే."

"బాగానే పనిచేస్తోందే!" అని స్విచ్ ఆన్ చేసేడు మా పెద్దబ్బాయి. "ఇప్పుడు - జాబులు, జవాబులు - ప్రేక్షకుల ఉత్తరాలకు మా సమాధానాలు" అని అనౌన్స్‌మెంటు వొచ్చింది.

"ఆపెయ్యి, ఆపెయ్యి" అని దూరంనించి అరిచింది మా అమ్మాయి. మా అబ్బాయి

టీవీ ఆపే ప్రయత్నం మీద లేచాడు గాని, పరమేశ్వర్రావు వాణ్ణి చెయ్యిపట్టుకొని ఆపేశాడు. ప్రోగ్రాంని ఎవరూ ఆపలేదు.

టి.వి. తెరమీద ఒక స్త్రీ, ఒక పురుషుడు వచ్చేరు. ఎంతో లబ్జుగా, వాళ్లు రాబోయే ఇరవై నిముషాల్లో తాము మా ఎదురుగా నిర్వహించే కార్యభారాన్ని వివరించేరు.

"నన్నడిగితే, హైదరాబాద్ టి.వి. వారు సమర్పిస్తున్న అన్ని కార్యక్రమాల్లో ఈ జాబులు - జవాబులు కార్యక్రమం -బెస్ట్" అన్నాడు పరమేశ్వర్రావు.

మా అమ్మాయి పరుగెట్టుకొచ్చింది. "ఏంటి అంకుల్, అలా అంటారు! ఏముంటుంది ఇందులో? వాళ్లని బాగా పొగిడిన వాళ్ల పేర్లు చదువుతారు. ఎవళ్లూ పొగడకపోతే కరీంనగర్ నుంచి ఎల్లయ్య, కామారెడ్డి నుంచి పుల్లయ్య, మా కార్యక్రమాల్ని పొగుడుతూ ఉత్తరాలు రాసేరని వీళ్లే కల్పించి చెప్పేస్తారు." అంది కోపంగా.

"తప్పమ్మా తప్పు! ముందు నువ్విలా వొచ్చి ఈ స్టూల్ మీద కూర్చో. ఇది గొప్ప వినోద కార్యక్రమం అని నేను నీచేతనే ఒప్పిస్తాను-" అన్నాడు పరమేశ్వర్రావు. మా అమ్మాయి వెళ్లి అతని పక్కనే ఉన్న స్టూల్ మీద కూచుంది. చెవిలో ఏం గొణిగాడో టీవీ వాల్యూమ్‌లో వినిపించలేదు గాని మా అమ్మాయి నిండుగా నవ్వింది.

"ఏంటో, చెప్పి మమ్మల్ని కూడా నవ్వించండి మరి!" అంది మా ఆవిడ.

"ఒక కార్టూన్ గురించి గుర్తుచేసేరు" అని మా అమ్మాయి ఆ దగ్గిర్లో ఉన్న ఒక మాసపత్రిక తీసి చకచకా పేజీలు తిప్పి ఆ కార్టూన్ వెతికి పట్టుకుని ప్రదర్శించింది. "మీరు ఉత్తరాలు చదువుతున్నప్పుడు మీ పక్కనున్నాయన మీకేసి ఎలా చూస్తారో మీ రెప్పుడైనా గమనించారా?" అని ఒక ఉత్తరం ఆ లేడీ ఎనౌన్సర్‌కి వచ్చిందట.... ఇంతలో, "అవును. ఆ రోజు కరెంటు పోవడంవల్ల ఆ నాటిక పూర్తిగా చూపించలేకపోయాం. మీరందరూ అడుగుతున్నారు కనక ఇంకోసారి మొత్తం నాటిక త్వరలోనే ప్రసారం చేస్తాం." అన్నాడు టీవీలోంచి మాట్లాడుతున్న మగాయన.

"హతవిధీ! ఆరోజు కరెంటు పోయినందుకు కొంతసేపైనా శిక్ష తగ్గిందని మేం సంతోషిస్తే మళ్లీ ఆ చెత్త నాటకం పూర్తిగా మన నెత్తిని రుద్దుతాట్ట" అంది మా ఆవిడ.

"సినిమాలు మంచివి వెయ్యడం లేదని రాశారు. ఈ విషయంలో మాదొక మనవి. మేం సినిమాలు టెలికాస్ట్ చెయ్యడం అనేది ఆయా సినిమాల హక్కుదార్లు మా నిబంధనలకి లోబడి మాకు అంగీకారం తెలిపితే ఆ పైన అలాంటి సినిమాలు ప్రసారం చెయ్యవచ్చునా అని ఆలోచించి పరిశీలించి నిర్ణయిస్తాం తప్పా మంచి సినిమాలు ఎక్కడున్నాయి; వాటి హక్కుదార్లు ఎవరు అని మా అంతట మేం వెతుక్కుంటూ వెళ్లడం అసాధ్యం" అన్నాడు టీవీలో మాట్లాడిన ఆయన.

"చూడండి! ఇదీ మన గతి. 1931 నుంచి తెలుగులో సినిమాలు తీస్తున్నారు. వేల సంఖ్యలో వచ్చిన తెలుగు సినిమాల్లో కనీసం వందల సంఖ్యలో అయినా మంచివి-అంటే వాళ్లు చెప్పే మంచి-విజ్ఞానం, వినోదం ఉండేవి ఉన్నాయి కదా. ఆ సినిమాల హక్కుదార్లు వీళ్లిచ్చే స్వల్పమైన రాయల్టీకి (కమిషన్ మినహాయించి) ఇస్తారా? అంచేత మా ఫలానా (చెత్త) సినిమా మీరు వాడుకోండి సార్ అని అప్లికేషన్ పెట్టిన వాళ్లనుంచే సినిమాలు తీసుకుంటారన్నమాట.

అప్లికేషన్ పెట్టుకున్నారు గనక వీళ్ల నిబంధనలకి ఇతర షరతులకి ఒప్పుకుని తీరాలి. వాళ్లూ వాళ్లూ బాగానే ఉంటారు. మధ్యని హింస అనుభవించేది మనం" అన్నాడు మా రెండో అబ్బాయి.

"మా కేంద్రం నుంచి వార్తలు చదివే వారిలో ఎక్కువ మందికి తెలుగు భాష సమంగా పలకడం రాదని మీరు రాసిందాంట్లో నిజం వుందని మేం ఇప్పుడిప్పుడే తెలుసుకుంటున్నాం. కాని, కొందరు మాత్రమే ఈ బలహీనత కలిగి వున్నారని మేం ఇన్నాళ్లూ భావిస్తూ వచ్చాం. వీరైనా; వార్తలు చదవడానికి ముందు బాగా గంటల తరబడి రిహార్సల్సు వేసుకుని మరీ కెమేరా ముందుకి వస్తారు తప్ప ప్రిపరేషన్ లేకుండా రారు" అని టీవీ ఆయన వివరించారు.

"అయ్య బాబోయి. తప్పుల తడక భాషా, నత్తీ, మింగుడూ, ఇవన్నీ గంటల తరబడి రిహార్సల్సు అయ్యేకనే ఇలా వస్తే ఇహ ఆ వార్తలు రాసినవి రాసినట్టు చదివితే ఇంకెంతటి సౌరభాలు చిమ్ముతాయో కదా!" అని కుర్చీలో వెనక్కి చారబడిపోయాడు మా పెద్దబ్బాయి.

"ఈ ప్రకటన చూడు" అని జేబులోంచి ఒక కాగితం తీసేడు పరమేశ్వర్రావు. "టి.వి.లో అనౌన్సర్లుగా వార్తలు చదివేవారుగా పనిచేయుటకు యువతీ యువకులు కావలెను. తెలుగు తెలిసివుంటే అదనపు అర్హతగా పరిగణించబడును" అని ఉంది, ఆ ప్రకటనలో. "అయ్యో, అయ్యో!" అని నోరు నొక్కుకుంది మా ఆవిడ.

"ఇది కూడా కార్టూనే లెండి, భైపడకండి" అన్నాడు పరమేశ్వర్రావు నవ్వుతూ.

"మీరందరు ఇంకా ఎన్నో విషయాలమీద మా కార్యక్రమాలు చాలా బావున్నాయంటూ ఉత్తరాలు రాసేరు. అవన్నీ చదవాలనే ఉంది. కాని టైమైపోయింది. ఇంక సెలవిప్పిస్తారుగా. మళ్లా పదిహేను రోజుల్లో మీ ముందుకి వస్తాం."అని టీవీ ఆయన చెప్పడం; టీవీ తెర నల్లగా అయిపోవడం జరిగింది.

"బతికించావు, నీ పుణ్యమాని" అంది మా ఆవిడ నవ్వుతూ.

"చూసేరా! మీలో ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమం చూసి ఎంతో వినోదం పొందేరు. నేనే గెల్చాను!" అని స్నానానికి లేచాడు పరమేశ్వర్రావు. ★

# 21. చిదంబర రహస్యం

చిదంబర రావూ నేనూ అప్పుడెప్పుడో టవును హాల్లో పేకాట ఆడుతూ ఉండినప్పుడు పరిచయస్తులం అయ్యాం. ఇప్పుడు అతనూ ఆడడం మానేశాడు. నేనూ మానేశాను. అయినా మాకిద్దరికీ అప్పుడున్న పరిచయం అలా మెత్తగా సాగుతూనే ఉంది. సినిమాలు పత్రికలు మొదలైన విషయాల్లో అతనికీ నాకూ సామాన్య అభిరుచులు ఉండడం వల్ల మేం ఇద్దరం ఎప్పుడేనా ఎక్కడేనా కలుసుకుంటే చెప్పుకునే కబుర్లు మాకిద్దరికీ ఉన్న పరిచయాన్ని పెంపుచేసేయి తప్ప పాడు చేయలేదు. మొన్నీ మధ్య ఒక పాత సినిమాకి అతనూ నేను శ్రీమతులతో సహా వెళ్లగా మా ఆవిడా, వాళ్లావిడా ఒకే అగ్రహారపు ఆడపడుచులని తెలిసిపోయింది. వాళ్లిద్దరూ ఒసే భ్రమరాంబా అంటే ఒసే సత్తమ్మా అని పిల్చుకుంటూ మమ్మల్నిద్దరినీ మరచిపోయి